క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గుడ్లవల్లేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్య ప్రదంగా ఉంటాయని డోకిపర్రు గ్రామ కార్యదర్శి సూదాబత్తుల రమేష్ పిలుపునిచ్చారు. డోకిపర్రు గ్రామ సచివాలయ పరిధిలో స్వచ్ఛతా హీ సేవ పేరిట ఆదివారం ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఈ ర్యాలీలో అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



గుడ్లవల్లేరు: కొండలమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ప్రాంగణం వేలాదిగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నందివాడ: మండలంలో రామాపురం, రుద్రపాక, పుట్టగుంటలో మెగా మెడికల్ క్యాంపును గుడివాడ ఐఎంఏ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పాలడుగు, పిన్నమనేని మాట్లాడుతూ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు అసోసియేషన్ వైద్యులు చర్మవ్యాధులు, సుగర్, ముక్కు చెవి, గొంతు, కండరాలు, ఎముకలు, పళ్ల తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యుడు మాగంటి శ్రీనివాస్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, కాకరాల సురేష్, యలమంచిలి సతీష్ ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ ముఖమండపంలోని వేదికపైకి చేర్చి అందంగా అలంకరించి మేళతాళాలు, పురోహితుల వేదమంత్రాల నడుమ కల్యాణ తంతు జరిపారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: వివాహితతో పాటు ఆమె కుమార్తె అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ డి. వెంకటకుమార్ కథనం ప్రకారం కొరగుంటపాలెంకు చెందిన పాము కొండాలమ్మ కుమార్తె మణికంటేశ్వరి కర్ణాటకలోని రాయచూర్‌లో భర్తతో నివాసం ఉంటోంది. ఆమెకు 10 నెలల పాప ఉంది. ఇటీవలే ఆమె కుమార్తెతో కొరగుంటపాలెం వచ్చింది. ఈ నెల 21 రాత్రి భర్త ఆనంద్ కుమార్తెతో తిరుగుపయనమైన ఆమె ముదినేపల్లిలో బస్సు ఎక్కింది. అదే సమయంలో కొరగుంటపాలెంకు చెందిన అచ్యుత రమేష్ అనే వ్యక్తి మణికంటేశ్వరీ వద్దకు వచ్చి తాను తీసుకురమ్మంటున్నాని చెప్పి ఆమెను మనవరాలితో సహా బైక్‌పై ఎక్కించుకుని పరారైనట్లు మణికంటేశ్వరి తల్లి కొండాలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిడ్కో వాసులకు ప్రయాణ కష్టాలు

- ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు
- ఆటోలు మాత్రమే దిక్కవడంతో నివాసితులపై అదనపు భారం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



టిడ్కో గృహ సముదాయం

గుడివాడ టౌన్: మినీ గుడివాడగా గుర్తింపు పొందిన టిడ్కో గృహ సముదాయాల వద్దకు ఆర్టీసీ బస్సు సేవలు ఏర్పాటు చెయ్యాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పట్టణానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో టిడ్కో గృహ సముదాయం, జగనన్న కాలనీ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. అప్పట్లో రాకపోకలకు సంబంధించి తలెత్తిన ప్రశ్నకు నాటి పాలకులు గృహాలలో 10 శాతం లబ్ధిదారులు చేరి జీవనం కొనసాగిస్తుంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఇదీ పరిస్థితి..

టిడ్కో గృహ సముదాయంలో 9,812 గృహాలు పూర్తి సౌకర్యాలతో ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొద్దిమంది తమ నివాసాలను టిడ్కో గృహాలకు మార్చేశారు. అదే సమయంలో బస్ సౌకర్యం ఏర్పాటు చెయ్యాలని లబ్ధిదారులు కోరగా కనీసంగా 10 శాతం గృహాలలోనైనా లబ్ధిదారులు వస్తే బస్సులు నడిపేందుకు తమకు ఏమాత్రం అభ్యంతరం లేదని ఆక్యుపెన్సీ ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అనంతరం ఈ విషయంపై అప్పటి పాలకులు దృష్టి పెట్టేటప్పటికి ఎన్నికల నోటిఫికేషన్ రావడం, నేతలు ఎన్నికల ప్రచారంలో ఉండటంతో అధికారులు సైతం ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 60 శాతం పైబడి గృహాలలో నివాసాలు ఉంటున్నారు. అంటే సుమారు 5,500 కుటుంబాలు అక్కడ జీవిస్తున్నాయి. కనీసంగా ఇంటికి ముగ్గురు చొప్పున 15 వేల వరకు ప్రజలు అక్కడ జీవనం కొనసాగిస్తున్నారు.

ఆటోవాలాల ఇష్టారాజ్యం..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన గృహాలలో సామాన్యులు జీవనం గడుపుతున్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక వృత్తి, చిరు ఉద్యోగాలపై ఆధారపడిన వారే. వీరికి కనీస ప్రయాణ సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం ఆటోలపైనే ఆధార పడటంతో వచ్చిన అవకాశాన్ని ఆటోవారు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికుల ఆరోపణ. పట్టణానికి రావాలంటే రూ. 30 నుంచి రూ. 40 తీసుకుంటున్నారని, కొత్తవారు కాలనీకి రావాలంటే వారి వద్ద నుంచి ఇష్టారాజ్యంగా సొమ్ము డిమాండ్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్ సౌకర్యం ఏర్పాటు చెయ్యాలని కోరుకుంటున్నారు.

బస్సుల కొరత ఉంది..

బస్సుల ఏర్పాటుపై ఆర్టీసీ డిపో మేనేజర్ డి. రాజేష్ కుమార్‌ను వివరణ కోరగా ప్రత్యేక సర్వీస్‌ల ఏర్పాటుకు బస్సుల కొరత ఏర్పడింది. సాధారణ రూట్‌లలో ప్రయాణికులను తరలించేందుకే బస్సులు చాలడం లేదు. కొత్తగా సర్వీసులు ఏర్పాటు చెయ్యాలంటే ప్రభుత్వం బస్సులను పెంచి కొన్ని బస్సులు డిపోకు కేటాయిస్తే తప్పకుండా సర్వీస్‌లను ప్రారంభిస్తామని అన్నారు.

కనీస సౌకర్యం కల్పించండి..



గత ప్రభుత్వం ఇచ్చిన హామీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేస్తారనే నమ్మకంతో కాలనీకి వెళ్లాం. బస్ సౌకర్యం ఇప్పటికి ఏర్పాటు చెయ్యలేదు. ప్రతిరోజు వేల సంఖ్యలో పట్టణానికి వచ్చి పనులు ముగించుకుని రాత్రికి గృహాలకు చేరుతున్నాం. చిరు ఉద్యోగుల సౌకర్యం కోసమైనా ఉదయం, సాయంత్ర సమయాలలో టిడ్కో కాలనీ నుంచి ఏలూరు బైపాస్‌రోడ్ వరకు బస్ సౌకర్యం ఏర్పాటు చేస్తే మా లాంటి పేద కార్మికులకు మేలు జరుగుతుంది.

– ఎస్. ఈశ్వరి, చిరు ఉద్యోగి

నష్టపోతున్నాం..



బస్ సౌకర్యం లేకపోవడంతో కాలనీ వాసులందరూ నష్టపోతున్నారు. ఆటోలో బస్టాండ్ వరకు రూ. 30 తీసుకుంటున్నారు. నెహ్రూచౌక్ దాటితే రూ. 40 వసూలు చేస్తున్నారు. సాధారణంగా షాపుల్లో, ఇతర దుకాణాలలో పని చేసే చిరు ఉద్యోగులకు రోజుకు రూ. 250 నుంచి రూ. 300 ఇస్తారు. ఇందులో రాను, పోను రూ. 60 నుంచి రూ. 80 అంటే నెలకు రూ. 1800 నుంచి రూ. 2400 ఆటోలకు చెల్లించాల్సి వస్తోంది. రూ. 7 వేల నుంచి రూ. 7,500 వరకు జీతం తీసుకునే వారు మూడొంతులు ఆటోలకే దారపోస్తున్నారు. ప్రభుత్వం స్పందించి బస్ సౌకర్యం ఏర్పాటు చెయ్యాలి.

– కడియం మేరి, చిరు ఉద్యోగి

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కండి

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

గుడివాడ టౌన్: త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. గౌతమ్ రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల మద్దతు పూర్తిగా ఉందన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల గత ఎన్నికలలో ప్రభుత్వం ఓటమి చవిచూడాల్సి వచ్చిందన్నారు. రానున్న పట్టభద్రుల ఎన్నికలు ప్రజలలో పార్టీపట్ల ఉన్న అభిమానాన్ని తిరిగి చాటేందుకు మంచి అవకాశమన్నారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని నిరూపించడానికి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రతి పట్టభద్రుని ఓటర్‌గా చేర్చి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వినాయక నిమజ్జనాలు



కనక డప్పుల వాయిద్యాలతో స్వామివారి ఊరేగింపు

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం, గుడ్లవల్లేరులో వినాయక చవితి వేడుకలను ముగించుకున్న నిర్వాహకులు ఆయా విగ్రహాలను ఊరేగిస్తూ ఆదివారం నిమజ్జనం చేశారు. స్వామివారి విగ్రహాలను కనక డప్పుల వాయిద్యాలు, బాణాసంచాతో ఊరేగించారు. అడుగడుగునా గణపతికి మహిళా భక్తులు హారతులు పట్టి పండ్లు, టెంకాయలను సమర్పించారు. భక్తులు స్వామివార్లని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

లడ్డూ పాటల్లో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ ఎదుట శ్రీ లక్ష్మీ బైక్ మెకానిక్ వర్క్స్ అధినేత చుక్కల ఉపేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూల వేలం పాటల్లో భక్తులు సందడి చేశారు. స్వామివారి సన్నిధిలోని నాలుగు లడ్డూలను మురాల నరేష్ రూ.7,777, నీలం దుర్గాప్రసాద్ రూ.5,100, బోయిన రాంబాబు రూ.5వేలు, ఉపేంద్ర రూ.4వేలకు వేలం పాటల్లో తమ సొంతం చేసుకున్నారు.



బంటుమిల్లి రోడ్‌లో అన్నసమారాధన చేస్తున్న నిర్వాహకులు

భారీ అన్నసమారాధనలు

గుడివాడ టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎక్కల మణిదీప్ ఫ్రెండ్స్ సర్కిల్, వ్యాపారస్తులు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కె. పవన్‌కుమార్, ఎం. నాగరాజు, ఎం. వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక గౌరీశంకరపురంలోని ఆర్యవైశ్య యువజన సంఘం గుడివాడ, అక్షయ ఫ్రెండ్స్ సర్కిల్, వాసవీ ఇంటర్నేషనల్ పరివార్ ఆధ్వర్యంలో గౌరీశంకరపురంలో అన్నసమారాధన జరిగింది. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బి. భాజేశ్వరరావు, పోపూరి రవికిరణ్, వి. శంతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

కైకలూరు: రాష్ట్రంలో మహిళాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఆచవరం, వేమవరప్పాడు గ్రామాల్లో సీమంతాల కార్యక్రమం ఆదివారం జరిగింది. పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలను అందించారు. గర్భిణులు పోషకాహారం విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి మాట్లాడుతూ ఈ నెల 30 వరకు పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలల్లో కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కలిగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్‌ఎన్ ఉమామహేశ్వరరావు, కూటమి నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో తెగుళ్ల నివారణ



బొమ్మినంపాడులో తూటికాడ కషాయం తయారుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ముదినేపల్లి రూరల్: వరిసాగులో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలతో తెగుళ్లు, పురుగులు నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు దళితవాడలో వరిపైరుకు సోకే సుడిదోమ నివారణకు ఉపయోగించే తూటికాడ కషాయం, దీని తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. తూటికాడ ఆకు ఆవు మూత్రంతో తయారుచేసిన ద్రావణంతో వరిలో వచ్చే సుడిదోమను సమర్థంగా నివారించవచ్చన్నారు. దీనిని తయారుచేసే విధానం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది నారాయణ, సుధాకర్, అనూష పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు అండగా నిలవాలి

పెనమలూరు: క్యాన్సర్ వ్యాధితో బాధపడేవారికి అందరూ అండగా నిలవాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సీఎల్ వెంకట్రావు అన్నారు. కానూరు అమెరికన్ అంకాలజీ ఆస్పత్రిలో ఆదివారం రూట్స్‌హెల్త్ ఫౌండేషన్, జై భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ రోజ్ డే వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులను రోగులు అనకూడదని, వారిని క్యాన్సర్‌తో పోరాడే ఫైటర్స్ అనాలని పేర్కొన్నారు. రూట్స్ అధ్యక్షుడు పోలవరపు విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మానసికంగా ధైర్యం కల్పించి అండగా నిలవాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ కోట రాజేష్ మాట్లాడుతూ చికిత్సతోపాటు మానసిక ధైర్యం ముఖ్యమన్నారు. కాగా క్యాన్సర్‌తో ఉన్న నలుగురు చిన్నారులకు బొమ్మలు, పండ్లు అందజేశారు. అదేవిధంగా 80 మంది క్యాన్సర్ బాధితులకు పండ్లు, గులాబీలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు కోటా రాజేష్, డాక్టర్ విజయ్, డాక్టర్ క్రాంతిలను సత్కరించారు. కార్యక్రమంలో అన్నే శివనాగేశ్వరరావు, డాక్టర్ పద్మజ, కన్వీనర్ మాధవి, ట్రస్టు సభ్యులు షకినం శ్రీనివాస్, సుధారాణి, విజయలక్ష్మి, శివకృష్ణ, శిరీషా, చందు పాల్గొన్నారు.

కానూరులో వృద్ధుడు అదృశ్యం

పెనమలూరు: కానూరులో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. కానూరు కృష్ణానగర్‌లో కొండపల్లి రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులతో ఉంటుంది. రాజ్యలక్ష్మి తల్లి ఏడు సంవత్సరాల క్రితం మరణించడంతో నాగాయలంకలో ఉండే ఆమె తండ్రి ఎ. శివరామ ప్రసాదరావు కూడా కుమార్తెతో కలిసి కానూరులో ఉంటున్నాడు.

కాగా ఈనెల 12వ తేదీన శివరామ ప్రసాదరావు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో రాజ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న నాగబాబు తదితరులు

గుడ్లవల్లేరు: వరదలతో సర్వం పోగొట్టుకున్న బాధిత కుటుంబాలకు హైఫై యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోత్రు నాగబాబు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. గుడివాడ నియోజకవర్గంలోని చేదుర్తిపాడు, పుట్టగుంట, విజయవాడ సింగ్‌నగర్, వాంబేకాలనీ, పైపుల రోడ్డులోని 5వేలకు పైచిలుకు ఆహార పొట్లాలతో పాటు 770కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, బిస్కెట్ ప్యాకెట్లను అందించినట్లు నాగబాబు చెప్పారు. ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ పార్థసారథి నిత్యావసరాల వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ సెక్రటరీ కళివరపు రంగారావు, ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి రవి, సహాయ కార్యదర్శి మంద సాంబశివరావు, కన్వీనర్ నూకతోటి సభ్యులు డి.మద్దాల వెంకటేశ్వరరావు, దుర్గరాజు, బోడపాటి రాజ్‌కుమార్, డీవీవీ ఆంజనేయులు పాల్గొన్నారు.

పాస్టర్ల వితరణ..



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పాస్టర్లు

ముదినేపల్లి రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల వల్ల ముంపు బారిన పడ్డ కుటుంబాలకు కొరగుంటపాలెం ప్రార్థనా మందిరాలకు చెందిన పాస్టర్లు నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. కృష్ణానది కరకట్ట ప్రాంతమైన చల్లపల్లి మండలం కె. కొత్తపాలెంలోకి వరద నీరు ప్రవహించి పలు కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి. వీరికి పాస్టర్లు బి. స్వర్ణన్ రాజు, వి. విజయకుమార్, పుట్టా పీటర్, పాస్టర్ సాలెం ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

వరద బాధితులకు విరాళం



పెదగొన్నూరులో ఎమ్మెల్యేకు చెక్కు రూపేణా విరాళం అందిస్తున్న దాత

ముదినేపల్లి రూరల్: వరద బాధితుల సహాయార్థం మండలంలోని పెదగొన్నూరుకు చెందిన బట్టు నాగమల్లేశ్వరరావు రూ.లక్ష, దాకరం గ్రామానికి చెందిన వల్లూరి వంశీమోహన్ రూ.25 వేలు విరాళాలను చెక్కుల రూపేణా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పెదగొన్నూరులో నీటమునిగిన పొలాలను పరిశీలించి ఎమ్మెల్యే రైతులతో మాట్లాడారు. అదే విధంగా సామూహిక సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అభినందనీయం



ఆచవరంలో రూ.50,000 చెక్కును ఎమ్మెల్యే కామినేనికి అందిస్తున్న దాత బీఎస్సార్

కైకలూరు: వరద బాధితులకు సహాయం చేయడానికి ముంచుకొస్తున్న దాతలకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి ఆక్వా రైతులు, ప్రజలు, వివిధ వ్యాపారస్తులు భారీ విరాళాలను అందించారన్నారు. ఆచవరం గ్రామానికి చెందిన బీఎస్ఆర్ ఆక్వా ఫీడ్స్ అధినేత బూరుబోయిన శ్రీనివాసరావు రూ.50,000 చెక్కును కామినేనికి అందించారు. అదే విధంగా ఇంగిలిపాకలంక, కలిదిండి, కైకలూరు. పోతుమర్రు, ఆచవరం గ్రామాలకు చెందిన అనేక మంది విరాళాలను అందించారు. త్వరలో సేకరించిన నగదు మొత్తాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి అందిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో కూటమి నేతలు పెన్మత్స త్రినాథరాజు, పోలవరపు లక్ష్మీరాణి, పూలా రాజీ, కొల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కు గుర్రం జాషువా సేవ రత్న అవార్డు

పామర్రు: పామర్రుకు చెందిన సాహితీవేత్త, సేవా సంస్థల ప్రతినిధి పీఎంఎస్ ప్రసాద్‌ను గుర్రం జాషువా స్మారక సేవా రత్న అవార్డుకు ఎంపిక చేసినట్లు ఐఎస్‌వో గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవ సంస్థ చైర్మన్ డాక్టర్ పి. యోహాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో 28న నిర్వహించే జాషువా జయంతి వేడుకలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందజేస్తామని ఆయన చెప్పారు.

24, 25న మండల స్థాయి స్కూల్ గేమ్స్

ఉయ్యూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఈనెల 24, 25 తేదీల్లో ఉయ్యూరు జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి జీవీ రమణ తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు తెలుపుతూ 24వ తేదీన అండర్-14, అండర్-17 బాలుర, 25న అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ అంశాల్లో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఔత్సాహికులు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

పెనమలూరు: బంగారు ఉంగరాలు దొంగతనం చేసిన వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పోరంకిలో ఉంటున్న మాదాసి జనార్దనరావు శనివారం స్నానానికి వెళుతూ ఇంట్లోని సోఫాలో రెండు బంగారు ఉంగరాలు ఉంచాడు. అతను స్నానం చేసి వచ్చి చూసేసరికి ఉంగరాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. క్రైమ్ పోలీసుల విచారణలో శ్రీకాకుళం జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన తవిటి రాజు చోరీ చేసినట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా బంగారు ఉంగరాలు పోలీసులకు అప్పగించాడు.

కాలువకు గండి.. సాగునీరు లేదండి



దావాజిగూడెం వద్ద ఏలూరు కాలువలో నిలిచిపోయిన నీటి ప్రవాహం

మండలంలోని కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువకు భారీగా గండి పడి ఇరవై రోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల అప్పారావుపేట పరిధిలోని పంట పొలాలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు. అంతేకాకుండా ఈ గండి వల్ల ఏలూరు కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోయి డెల్టా ప్రాంతంలో తీవ్ర సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వరి పొలాల్లో నీరులేక భూములు నెర్రెలు విచ్చుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువకు పడిన గండ్లను వెంటనే పూడ్చి పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలని కోరుతున్నారు. – గన్నవరం



నీరు లేక నెర్రెలిచ్చిన వరి పొలం



అప్పారావుపేట వద్ద కాలువకు గండి పడి వృథాగా పోతున్న నీరు